క్లుప్తంగా

విజయవాడ వెస్ట్ అనుబంధ విభాగం కమిటీ అధ్యక్షుల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గ అనుబంధ విభాగాల కమిటీలు నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కేసరి రాజశేఖరరెడ్డి(యూత్ వింగ్), పేరురి దుర్గాభవాని(మహిళా విభాగం), దుక్కా హరి భాస్కర్(బీసీ సెల్), గంపా నవీన్(ఎస్సీ సెల్), దేవత్ రవీంద్ర(ఎస్టీ సెల్), ఎండీ అన్వర్(మైనార్టీ సెల్), వనపల్లి రవీంద్ర(స్టూడెంట్ వింగ్), యక్కంటి శివారెడ్డి(వలంటీర్స్ వింగ్), మధుబాబు(వాణిజ్య విభాగం), బోయోల్ల రాజేష్ (వైఎస్సార్‌టీయూసీ), చిన్ని కోటేశ్వర రావు(కల్చరల్ వింగ్), నడికట్టు రమణారెడ్డి (సోషల్‌మీడియా వింగ్), దేవిరెడ్డి కరుణాకర్‌రెడ్డి(ఐటీ వింగ్), శంక పరమేష్(ఇంటెలెక్చువల్ ఫోరం), వడ్డూరి యశోధర్ (బూత్ కమిటీస్)ను నియమించారు.

త్రిశక్తి పీఠం హుండీ ఆదాయం రూ.12.68 లక్షలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో హుండీ కానుకలు లెక్కించగా రూ.12,68,839 ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్ అన్నారు. దేవస్థానం ఆవరణంలోని 12 హుండీ కానుకలు గురువారం లెక్కించారు. భక్తుల సమక్షంలో ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్ పర్యవేక్షణలో కమిటీ సభ్యులు 150 రోజులకు ఆలయంలోని 12 హుండీలు తెరిచి అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ ఆధ్యాత్మిక సలహాదారుడు బీహెచ్ విజయకిరణ్, కమిటీ సభ్యులు ఎం.రాజా, టి.మల్లేశ్వరరావు, ఎ.జగన్ పాల్గొన్నారు.

23న భజన బృందాల ఆత్మీయ సమావేశం

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ ఆదివారం ఎన్టీఆర్ జిల్లా స్థాయి భజన బృందాల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు ధర్మప్రచార పరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు రోడ్డు బీఎస్ఎన్ఎల్ సమీపంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో భజన బృందాలు, పారాయణం, నామసంకీర్తన బృందాల వారు పాల్గొనాలన్నారు. తిరుమలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విధి విధానాలపై చర్చిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 70322 55499 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్య నగర్ సెక్షన్ 11 కేవీ సితార ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతోపాటు మెయింటినెన్స్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్రబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సితార సెంటర్, రాము క్వారీ సెంటర్, ఎస్ కన్వెన్షన్ సెంటర్, మిథిలా నగర్, ఫిలడెల్ఫియా చర్చి రోడ్, దశరథ వీధి, రోటరీ నగర్, కబేళా సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

అదృశ్యమైన విద్యార్థినులు క్షేమంగా ఇళ్లకు చేరిక

గన్నవరం: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురైన ఐదుగురు విద్యార్థినులను గంటల వ్యవధిలోనే గన్నవరం పోలీసులు గుర్తించి గురువారం తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. పోలీసుల సమాచారం ప్రకారం.. మండలంలోని ముస్తాబాద గ్రామానికి చెందిన నాలుగురు, మాచవరానికి చెందిన మరో విద్యార్థిని విజయవాడలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. ఐదు రోజుల క్రితం ఇళ్ల నుంచి వెళ్లిన ఈ ఐదుగురు విద్యార్థినులు కళాశాలకు వెళ్లకుండా విజయవాడలోని షాపింగ్‌మాల్స్‌లో కాలక్షేపం చేశారు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వారిని తీవ్రంగా మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన వారు రహస్యంగా హైదరాబాద్ వెళ్లేందుకు ప్రణాళిక చేసుకున్నారు. వీరిలో ఓ విద్యార్థిని హైదరాబాద్‌లో పరీక్షల ఉన్నాయని కుటుంబ సభ్యులకు చెప్పి అందరూ విజయవాడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు జంక్షన్ మీదుగా హైదరాబాద్ బయలుదేరారు. అయితే ఒక విద్యార్థిని తండ్రి తన కుమార్తె కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గుర్తించి గన్నవరం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. తహసీల్దార్ కె. వెంకటశివయ్య, సీఐ శివప్రసాద్ విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం విద్యార్థినులను తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రమాదకరంగా దుమ్ము, ధూళి



భవానీపురం పోలీసు స్టేషన్ సమీపంలో రోడ్డు సగానికి దిబ్బపడిన దుమ్ము :



బైపాస్‌లోని రిలయన్స్ రోడ్డు పక్కన పేపర్ బ్లాక్స్‌పై చేరిన దుమ్ము

- భవానీపురంలో రోడ్లపైకి వస్తే దుమ్మే
- కళ్లలో, తలపై, రోడ్డు పక్కన ఇళ్లపైకి చేరుతున్న దుమ్ము
- అవస్థలు పడుతున్న వాహనదారులు, స్థానికులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం రోడ్లపై ఎక్కడ చూసినా దుమ్ము, ధూళి కనిపిస్తోంది. రోడ్డు మార్జిన్లలో పెద్ద ఎత్తున దుమ్ము పేరుకుపోయింది. డివైడర్‌కు ఇరువైపులా పెద్ద ఎత్తున దుమ్ము, మట్టి చేరింది. కార్పొరేషన్ అభివృద్ధి పనులకు కోసం తవ్విన చోట మట్టి దిబ్బలుగా వేస్తున్నారు. అది కాస్త వాహనాలు తిరగడం, గాలికి రోడ్లపైకి విస్తరిస్తోంది. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

బయటకు వచ్చే పరిస్థితి లేదు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రోడ్లపై దుమ్ము, ధూళీ లేకుండా ప్రజలకు చక్కగా రోడ్లను అభివృద్ధి చేసింది. గత ప్రభుత్వంలో భవానీపురం, విద్యాధరపురం, ఊర్మిళానగర్ ప్రాంతాల్లో రోడ్లను అద్భుతంగా నిర్మించారు. డస్ట్ ఫ్రీ రోడ్ల కోసం మార్జిన్లలో పేపర్ బ్లాక్స్ ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత చాలా చోట్ల పేపర్ బ్లాక్స్ దెబ్బతిన్నాయి. మట్టి, ఇసుక, కంకర వంటి మెటీరియల్ రవాణా చేసే వాహనాలు మార్జిన్లలో పార్క్ చేస్తున్నారు. దీంతో మార్జిన్లు దెబ్బతిన్నాయి. పేపర్ బ్లాక్స్‌పై ఎక్కడ చూసినా దుమ్ము, ధూళీ దర్శనమిస్తోంది. కొన్ని చోట్ల రోడ్డు మధ్య వరకు దుమ్ము దిబ్బలుగా పేరుకుపోయింది. వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము లేచి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వాహనదారులు, పాదచారుల కళ్లలోనూ, తలపైన దుమ్ము చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం వేళల్లో ధూళి మేఘాల్లా ఆవరిస్తోంది. రోడ్ల పక్కన నివాసాల వారు దుమ్ముతో అవస్థలు పడుతున్నారు. ఇళ్లలోకి పెద్ద ఎత్తున చేరుతుండడంతో శుభ్రం చేసుకోలేక పోతున్నారు. ఇక శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారు. డస్ట్ ఎలర్జీ వంటి వ్యాధులు ఉన్నవారు బయటకు వచ్చే పరిస్థితి లేదు.

రోడ్లు తవ్వి వదిలేయడంతో తిప్పలు..

భవానీపురం పోలీసు స్టేషన్ ఎదురుగా దుమ్ము రోడ్డు సగానికి విస్తరించింది. రిలయన్స్ మార్ట్, చర్చి సెంటర్ వద్ద మార్జిన్లలో ఏర్పాటు చేసిన పేపర్ బ్లాక్స్‌పై పెద్ద ఎత్తున దుమ్ము చేరింది. చర్చి సెంటర్ వద్ద పైపులైన్ లీకేజీ కారణంగా రోడ్డు తవ్వారు. మరమ్మతులు పూర్తి చేశారు. కానీ అక్కడ దిబ్బగా పోసిన మట్టిని రోజులు గడుస్తున్నా తొలగించడం లేదు. బాగా రద్దీగా ఉండే ఈ రోడ్డులో మట్టి దిబ్బపై వాహనాలు తిరుగుతుండడంతో వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారులపై పెద్ద ఎత్తున దుమ్ము పడుతోంది. ఇటీవల క్రాంబే రోడ్డుకు ఇరువైపులా పైపులైన్ ఏర్పాటు కోసం రోడ్డును తవ్వేశారు. రోడ్డు పొడువునా మట్టి పోశారు. కొన్ని చోట్ల తవ్విన చోట సిమెంట్ చేశారు. మరి కొన్ని చోట్ల సిమెంట్ వేయకుండానే వదిలివేశారు. దీంతో ఆ ప్రాంతంలోని దుమ్ము రోడ్డు మొత్తం చేరింది. రోడ్డు తవ్వకం పనులు పూర్తయిన వెంటనే పూడ్చి వేయడం, సిమెంట్ వేసి యథాతథంగా చేయడంలో ఆలస్యం అవుతోంది. ఫలితంగా డస్ట్ ఫ్రీ రోడ్లకు బదులు ఎక్కడ చూసినా డస్టే దర్శనమిస్తోంది. పైపులైన్‌లు, లీకేజీ మరమ్మతులు, ఇతర పనుల కోసం తవ్విన చోట పనులు ముగియగానే పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు. బైపాస్ రోడ్డులో పేపర్ బ్లాక్స్‌పై దుమ్ము తొలగిపోయేలా నిరంతరం పర్యవేక్షించాలని వాహదారులు వేడుకుంటున్నారు.

23 నుంచి పాత శివాలయంలో శివరాత్రి మహోత్సవాలు



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఈవో నటరాజన్ షణ్ముగం, అర్చకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో ఈ నెల 23 నుంచి మార్చి మూడో తేదీ వరకు మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఆలయ అర్చకులతో కలిసి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధర్మరాజు ద్వారా స్వామి వారి ప్రతిష్ట జరిగినట్లుగా ఆలయ స్థల పురాణం చెబుతుందన్నారు. మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని స్వామి వారికి కల్యాణ, రథ, పుష్పయాగోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

విశేష పూజలు..

ఈ నెల 23వ తేదీన స్వామి వారిని పెండ్లికుమారునిగా అలంకరిస్తామన్నారు. అదే రోజు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అంకురారోహణ, ధ్వజారోహణోత్సవం, అగ్నిప్రతిష్టాపన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 24న స్వామి వారికి నిత్య ఔపసన, బలిహరణ, 25న విశ్వబ్రాహ్మణ సంఘం వారిచే శ్రీ రావణ బ్రహ్మ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవాలు, 26న మహాశివరాత్రిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. సాయంత్రం వేద పారాయణం, లింగోద్భవకాల అభిషేకాలు, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారికి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి కల్యాణోత్సవాలు ఉంటాయన్నారు. 27న పూర్ణాహుతి, శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ వారిచే రథోత్సవాలు, 28న కొట్నాలు, అవభృథోత్సవం, సాయంత్రం దొంగలదోపు ఉత్సవం, మార్చి ఒకటిన ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పయాగం, పవళింపు సేవలు తదితర కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, ఇతర పారిశుధ్య కార్యక్రమాలకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఆలయ అర్చకస్వాములు నాగరాజుశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో వ్యవస్థాపక సామర్థ్యాలను మెరుగుపర్చాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి వ్యవస్థాపక సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని ఈఎండీపీ జిల్లా మేనేజర్ ఎం.బాలకిరణ్ అన్నారు. బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్‌లో ఎస్‌సీఈఆర్‌టీ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అమలవుతున్న ఎంట్రాప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ) పనితీరును గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను ప్రోత్సహించాలని, నైపుణ్యాలను పెంపొందించాలని బాలకిరణ్ చెప్పారు. విద్యార్థి దశ నుంచే వ్యవస్థాపక మనస్తత్వాలను, ఆలోచనా విధానాన్ని రేకెత్తించాలన్నారు. భవిష్యత్‌లో వివిధ రంగాల్లో పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపారవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. అనంతరం మలినసీటిని శుద్ధీకరించటంలో వివిధ దశలపై రిసోర్స్‌పర్సన్ కె.ఎ.ఎస్. దయాకర్ బాబు విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

క్షేత్రస్థాయి పర్యటనలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



విజయ కాన్వెంట్‌లో డ్రిల్ చేయిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పటమట లక్ష్మీపతి అప్పారావు పార్కును సందర్శిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): అగ్ని ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కార్మెల్ నగర్‌లోని సెయింట్ మేరీ విజయ కాన్వెంట్, చుట్టుగుంటలోని మెట్రో హోల్ సేల్ మార్ట్‌ను సందర్శించారు. తొలుత సెయింట్ మేరీ విజయ కాన్వెంట్‌ను సందర్శించి అక్కడున్న ఫైర్ సేఫ్టీ పరికరాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదం తలెత్తిన వెంటనే ఎటువంటి చర్యలు తీసుకోవాలి వంటి అంశాలపై ఫైర్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే మెట్రో కాంపౌండ్‌లో ఫైర్ ఇంజిన్ తిరగటానికి అనుకూలంగా ఉందా లేదా అని పరిశీలించారు. అక్కడున్న మంటలను ఆర్పే పరికరాలు స్మోక్ డిటెక్టర్, ఫైర్ స్ప్రింక్లర్, ఈల్ట్ హైడ్రెంట్ తదితర అగ్ని ప్రమాద నివారణ పరికరాలను పరిశీలించారు. విద్యుత్ సరఫరా నిలిచినా ఎమర్జెన్సీ ఎగ్జిట్ కనపడేటట్టు రేడియం స్టిక్కర్లు దారిలో ఉండాలని సూచనలు ఇచ్చారు. మెట్రో మార్ట్‌లో సెట్ బ్యాక్‌లో చిన్న లోపాలను గమనించి, ఉన్న లోపాలను సరిచేస్తేనే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తానని మెట్రో మేనేజర్‌కు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీ ఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు

డీసిల్టింగ్ నిరంతర ప్రక్రియ

పటమట(విజయవాడతూర్పు): వర్షాలు పడినప్పుడు రోడ్డు మీద నీరు నిలువ ఉండకుండా ఉండేందుకు నగరంలోని అన్ని ప్రాంతాల్లోని డ్రెయిన్లలో నిరంతరం డీసిల్టింగ్ ప్రక్రియ జరుగుతూ ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం నగర పర్యటనలో భాగంగా ఆయన ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం రోడ్డు, ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, కోనేరు శ్రీధర్ వీధి, గురునానక్ కాలనీ, ఆంధ్రా లయోలా కాలేజ్ రోడ్డులో పర్యటించారు. కోనేరు శ్రీధర్ వీధిలో ఉన్న లక్ష్మీపతి అప్పారావు సరోజినీ నగరపాలక సంస్థ పార్క్ నిర్వహణలో ఎటువంటి జాప్యం ఉండరాదని, ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, ఉద్యానవన సిబ్బంది సమన్వయంగా పనిచేయాలన్నారు.

ప్రాంతీయ భాషలోనే సాంకేతిక పరిజ్ఞానం ఉండాలి



మాట్లాడుతున్న రెహ్మాన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రాంతీయ భాషల్లోనే సాంకేతిక పరిజ్ఞానం ఉండాలని స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ రెహ్మాన్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో గెరిల్లా ఓపెన్ యాక్సెస్ అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ప్రాంతీయ భాషలోనే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొదించుకునే విధానాన్ని రెహ్మాన్ వివరించారు. ప్రస్తుతం ఉన్న వికీపీడియాలో కొంత భాగం మాత్రమే ప్రాంతీయ భాషలో సమాచారం పొందుపరిచారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉండే అన్ని ప్రాంతీయ భాషల్లో సమాచారాన్ని పొందే విధంగా వివిధ యాప్స్ రావటం కోసం తమ వంతు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గెరిల్లా ఓపెన్ యాక్సెస్ మేనిఫెస్టోను తెలుగులో రూపొందించిన పత్రాన్ని కళాశాల కంప్యూటర్ విభాగంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శరవణకుమార్ మాట్లాడుతూ ప్రాంతీయ భాషలో సమాచారం ఇంటర్‌నెట్ అందుబాటులో ఉంటే ప్రపంచం మొత్తం అన్ని విషయాల మీద అందరికీ అవగాహన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్స్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ విజేతలకు అభినందన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ కళాశాల జట్టు చాంపియన్‌షిప్‌ను సాధించినట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. ఇటీవల డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల (మైలవరం)లో టోర్నమెంట్ జరిగిందని పేర్కొన్నారు. అందులో తమ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచి కప్‌ను సాధించారన్నారు. జట్టును గురువారం కళాశాలలో అభినందించారు. పి.తేజ, టి.శివనాగ కార్తీక్, జె.సుభాష్, వి.అరవింద్‌బాబు, కె.సంగీత్‌కుమార్, పి.సాయితేజ, కె.చంద్రులతో కూడిన తమ కళాశాల జట్టు త్వరలో సేలం (తమిళనాడు)లోని పెరియార్ విశ్వవిద్యాలయంలో జరుగబోయే దక్షిణ భారతస్థాయి విశ్వవిద్యాలయాల పురుషుల హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైందన్నారు. వీరంతా కృష్ణా విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాస్ క్రీడాకారులను అభినందించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణ రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌పై ప్రత్యేక డ్రైవ్




కాళేశ్వరరావు మార్కెట్‌లో ప్లాస్టిక్‌ను సీజ్ చేస్తున్న ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించిన క్రమంలో వీఎంసీ ప్లాస్టిక్ విక్రయదారులపై ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు వీఎంసీ పరిధి సర్కిల్-1లోని కాళేశ్వరరావు మార్కెట్, సర్కిల్-2 పరిధిలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ప్లాస్టిక్ షాపులపై దాడులు నిర్వహించింది. ప్రజారోగ్య విభాగం ముఖ్య అధికారి డాక్టర్ సురేష్ బాబు ఆదేశాలతో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ యోగేంద్ర సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయాల షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గురువారం ఒక్కరోజే కాళేశ్వరరావు మార్కెట్‌లోని పలు షాపుల్లో 200 కేజీల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, తదితరాలను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. ఆయా షాపుల ఓనర్లు, నిర్వాహకుల నుంచి రూ. 50 వేలు జరిమానా విధించామని ప్రజారోగ్య విభాగం అధికారులు తెలిపారు. నగరంలోని భవానీపురం, కాళేశ్వరరావు మార్కెట్, గవర్నర్‌పేటలో పలు ప్రాంతాల్లో దాడులు చేసి సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నప్పటికీ కొంతమంది వ్యాపారులు గొల్లపూడిలోని హోల్‌సేల్ మార్కెట్‌లో కొనుగోలు చేసి నగరంలో విక్రయాలు జరుపుతున్నారని, గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌పై కూడా జిల్లా యంత్రాంగం దృష్టిసారిస్తే నగరంలో పూర్తిస్థాయలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయవచ్చని తెలిపారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్ నాశనం

అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ దామోదర్



మాట్లాడుతున్న ఏసీపీ దామోదర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ర్యాగింగ్‌కు పాల్పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. దామోదర్ అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ర్యాగింగ్ నిరోధక విభాగం ఆధ్వర్యంలో గురువారం ర్యాగింగ్ వల్ల విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులు, డ్రగ్స్ వాడకం, సైబర్ క్రైం వంటి అంశాలపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏసీపీ కె. దామోదర్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యల్లో భాగంగా మూడు నెలల నుంచి పదేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా కళాశాల ర్యాగింగ్ నిరోధక విభాగంతో పాటు, స్థానిక పోలీస్‌స్టేషన్ సహకారం తీసుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్‌ను ఏ రూపంలోనూ ఉపేక్షించమన్నారు. మాచవరం సీఐ సీహెచ్ ప్రకాష్, సదస్సు కార్యనిర్వాహణాధికారి డాక్టర్ జి.రమణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేయాలంటే కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కొండపల్లి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి నరసింహారావు డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెబుదామన్న మంత్రి వర్గ సభ్యుల అభిప్రాయాలు పత్రికల్లో ప్రకటించడంపై ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బీరు బాటిల్‌తో గొంతు కోసుకుని వీరంగం

మైలవరం: ఓ యువకుడు బీరు బాటిల్‌తో గొంతు కోసుకుని వీరంగం సృష్టించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం పొందుగల గ్రామానికి చెందిన యువకుడు శ్రీను బుధవారం రాత్రి తప్పతాగి రోడ్డుపై అడ్డగోలుగా తిరుగుతూ వాహనాలకు అంతరాయం కలిగించాడు. గురువారం ఉదయం గ్రామానికి ప్రవేశ మార్గంలో ఉన్న మల్లెతోట వద్ద లభించిన ఖాళీ బీరు బాటిళ్లను పగలగొట్టి గొంతు కోసుకుని వీరంగం చేశాడు. గమనించిన గ్రామానికి చెందిన కొందరు యువకులు శ్రీనును చికిత్స నిమిత్తం మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా గత కొంతకాలంగా ఈ యువకుడు మతిస్థిమితం కోల్పోయి తప్పతాగి గ్రామంలోని రహదారుల్లో అడ్డగోలుగా తిరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

వాహనం ఢీకొని 15 గొర్రెలు మృతి



మైలవరం: ఇంటి సామగ్రితో వస్తున్న ట్రక్కు వాహనం ఢీకొని 15 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. మైలవరం మండలం పొందుగల రోడ్డులో నివాసం ఉంటున్న గొర్రెల కాపరులు తమ గొర్రెలను మేత కోసం చంద్రగూడెం పొలాల్లోకి తోలుకువెళ్లారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత తిరిగి వాటిని ఇంటికి తోలుకోస్తున్నారు. మైలవరంలోని దర్గా సమీపంలో గొర్రెలు రోడ్డు దాటుతుండగా ట్రక్కు వాహనం జీవాలపైకి దూసుకువెళ్లడంతో 15 గొర్రెలు మృతి చెందాయి. మరికొన్ని జీవాలు గాయలపాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ పూర్తి

ఇబ్రహీంపట్నం: జాతీయ విద్యా విధానం-2020 సిఫార్సుల మేరకు విద్యా బోధన విధానంలో మార్పులపై అంగన్‌వాడీ కార్యకర్తలకు కొండపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి పేరుతో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు అమలు చేస్తున్న 'సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్' కార్యక్రమంపై ఐసీడీఎస్ అధికారులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఎంఈఓ రత్నశ్యాంబాబు, సూపర్‌వైజర్లు సీహెచ్ మాధవి, జి.రమాదేవి పాల్గొన్నారు.

అలసి.. సొలసి



ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడంతో ఐస్ క్రీమ్‌ల వ్యాపారానికి గిరాకీ ఏర్పడింది. ఈ క్రమంలో పున్నమి ఘాట్ వద్ద ఐస్ క్రీమ్‌లు విక్రయించే చిరు వ్యాపారికి ఐస్ బండే పట్టు పాన్పు అయ్యింది. దీంతో బండిపైనే నిద్రించాడు. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా గురువారం క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ